క్లుప్తంగా

గోకులం షెడ్ల ప్రారంభం

పాములపాడు: మండలంలోని మద్దూరు, రుద్రవరం గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం పాడి రైతులతో ప్రారంభం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధీనియా మాట్లాడుతూ.. రైతులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బషీర్ అహ్మద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు, టీఏ ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పూర్తి అయిన 7 గోకులం షెడ్లను శుక్రవారం ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఓ వసుధ, వెటర్నరీ డాక్టర్లు అనూష, గౌసియా బేగం ప్రారంభించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

నందికొట్కూరు: తెలుగు సంప్రదాయాలను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు స్కాలర్ స్కూల్ అధిపతి కాశ్లూరి శివప్రసాద్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని స్కూల్‌లో మహిళలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కాశ్లూరి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి, రిపబ్లిక్ డేను పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేస్తామని చెప్పారు.

కళాకారుడి మృతి బాధాకరం

నందికొట్కూరు: కళాకారుడు పుట్టల నాగరాజు తీరని లోటని అభినయ ఐక్య రంగస్థల కళా సమితి అధ్యక్షుడు జయరాముడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 30 ఏళ్ల పాటు నందికొట్కూరు ప్రాంతంలో తెలుగు పద్య నాటకాల్లో పుట్టల నాగరాజు సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో రంగస్థల కళాసమితి సభ్యులు ఖాదర్ బాబు, కృష్ణ, పక్కీర య్య, రామకృష్ణ, మధు, వెంకటేశ్వర్లు, సాంభ శివప్ప, సుధాకర్, ఈరన్న, రమణ పాల్గొన్నారు.

అపరాల సాగు లాభదాయకం

వెలుగోడు: తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో మంచి ఆదాయం ఇచ్చే మినుము, పెసర లాంటి అపరాలను సాగు చేసుకోవాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. మండలంలోని మోత్కూరు, మాధవరం గ్రామలలో రబీలో సాగుచేసిన మినుము పంటను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అపరాల సాగుకు సంప్రదాయ పంటలతో పోల్చుకుంటే ప్రాణాధారమైన నీరు, ఎరువులు, పెట్టుబడి వ్యయం, సమయం అన్ని అపరాలకు తక్కువే అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగలింగం తదితరులు పాల్గొన్నారు.

శనగ సాగులో సస్యరక్షణపై అవగాహన

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ విజయశేఖర్ శనగ సాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆబీకేలు, రైతులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆత్మకూరు: పాణ్యం మండలం తమ్మరాజుపల్లె అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన శివకుమార్‌పై కేసు నమోదు చేసి శిక్షించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మిదేవి, విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రియాంక, బేగంబి, రవణమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరం ప్రారంభం

పగిడ్యాల: కొత్త పాలమర్రి స్టేజీ వద్ద నూతనంగా నిర్మించిన షిలోహు ప్రార్థన మందిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. పాస్టర్ జాన్‌మోజేస్, సంఘ పెద్దలు మార్క్, దానియేలు, ఇశ్రాయేలు, తిరుపాలు ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు. పాస్టర్లు కొల్లాపూర్ మోషే, జల్లాపూర్ పాల్, వెల్దుర్తి జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

పగిడ్యాల: నంద్యాల జిల్లాలోని మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం పగిడ్యాల మండలం నెహ్రూనగర్ సమీపంలోని కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో మత్స్యశాఖ చేపట్టిన ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నందికొట్కూరు నియోజకవర్గంలో 4 వేల మందికిపైగా లైసెన్స్ మత్స్యకారులు బ్యాక్‌వాటర్‌లో జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. బ్యాక్‌వాటర్‌లో చేప పిల్లల సహజ ఉత్పత్తి తగ్గిపోవడంతో ప్రభుత్వం 21 లక్షల చేప పిల్లలను విడుదల చేసిందని తెలిపారు. మత్స్యశాఖ నంద్యాల జిల్లా జేడీ రాఘవరెడ్డి, కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ, ఏడీ సంధ్య, ఎంపీడీఓ సుమిత్రమ్మ పాల్గొన్నారు.







స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఉత్తరద్వారం ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్న దేవస్థాన ఈఓ దంపతులు, స్వామిఅమ్మవార్లకు పుష్పార్చన నిర్వహించిన దృశ్యం



సిద్ధంగా ఉంచిన 40 రకాల పుష్పాలు

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- శ్రీశైలంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఉత్తర ద్వార దర్శనం
- వైభవోపేతంగా రావణవాహనసేవ, గ్రామోత్సవం
- ఉత్తరద్వారమైన శివాజీగోపురం ద్వారం నుంచి గ్రామోత్సవానికి తరలిన స్వామి అమ్మవార్లు



రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు గ్రామోత్సవం



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



పుష్పాల దాతను సత్కరిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైలం భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. వేకువజామునే స్వామిఅమ్మవార్లకు విశేషపూజాదికాలు, రావణవాహనసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. వేకువజామున 3గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, మంగళవాయిద్యాలు, సుప్రభాతం, ప్రాతఃకాలపూజలు, మహామంగళహారతులు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపంలో ఉత్తర ముఖంగా ఆశీనులను చేయించి విశేష పూజాదికాలను నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తర ద్వారం నుంచి వెలుపలకి తొడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలోనే రావణవాహనంపై ఆశీనులను చేయించి రావణవాహనసేవ జరిపించారు. అనంతరం ఉత్తరద్వారమైన శివాజీగోపురం నుంచి వెలుపలకు తీసుకువచ్చి గ్రామోత్సవం జరిపించారు. గ్రామోత్సవం అనంతరం భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా ఉత్సవమూర్తులను ఆలయ ముఖమండపం ఉత్తరం వైపున ఆశీనులు చేశారు. ఉత్సవంలో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, స్వామివార్ల ప్రధానార్చకులు కె.శివప్రసాద్‌స్వామి, స్థానాచార్యులు ఎం.పూర్ణానంద, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణశర్మ, పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మల్లన్నకు పుష్పార్చన

శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం పుష్యశుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని స్వామిఅమ్మవార్లకు విశేష పుష్పార్చన జరిపించారు. సాయంత్రం 6గంటలకు అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేపట్టారు. పుష్పకైంకర్యంలో గులాబి, చేమంతి, సుగంధాలు, నూరువరహాలు, కాగడా మల్లెలు, సన్నజాజులు, విరజాజులు, గన్నేరు, కనకాంబరం, సంపంగి, తామర మొదలైన పుష్పాలు, బిల్వం, దవనం, మరువం మొదలైన పత్రాలతో స్వామిఅమ్మవార్లకు పూజాదికాలు చేపట్టారు. సుమారు 4వేల కేజీల 40 రకాల పుష్పాలు ఈ పుష్పార్చనకు వినియోగించారు. దేవస్థాన వేదపండితులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15మంది వేదపండితులచే చతుర్వేద పారాయణాలు జరిపించారు. అలాగే శివసహస్రనామ స్తోత్ర పారాయణలు, లలితాసహస్రనామ పారాయణలు కూడా చేపట్టారు. పుష్పాలన్నింటిని పుంగనూరుకు చెంది న రామచంద్ర యాదవ్ విరాళంగా సమర్పించారు.

దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన ముక్కంటి దర్శనానికి ముక్కోటి ఏకాదశి రోజున భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

మహానందిలో కోదండరాముడికి లక్షపుష్పార్చన

మహానంది: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శివకేశవులకు నిలయమైన మహానందిలో శుక్రవారం వేడుకలు మహా వైభవంగా నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ మాజీ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి, రామపుల్లమ్మల ఆర్థిక సహకారంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామాలయం ముఖ్య అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ, పండిత బృందం ప్రత్యేక పూజలు చేపట్టారు. సీతారామచంద్రుల వారిని హనుమద్వాహనంపై మేళతాళాలతో తీసుకొచ్చి ఉత్తరద్వారంలో కొలువు చేశారు. అనంతరం కోదండరాముల వారికి లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది. భక్తులకు ఉదయం మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, భవానీ మహేష్‌ల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, గాయత్రీ దంపతులతో పాటు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం చిన్నా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేకువజామున 4 గంటల నుంచి సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు అనుమతిచ్చారు. స్వామివారికి లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని శివాలయం, సాయిబాబా దేవాలయం, అంబాభవానీ ఆలయంలో ఉత్తర ద్వారం దర్శనం భక్తులకు కల్పించారు. అదేవిధంగా వెంకటాపురం గ్రామంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.



అలంకరణలో తర్తూరులో రంగనాథస్వామి

ఆత్మకూరురూరల్: మండలంలోని శ్రీనల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచే భక్తులు ఉత్తరద్వార దర్శనానికి బారులు తీరారు. ఆలయ వంశపారంపర్య పురోహితులు రమణ స్వామివారి కైంకర్యాలు పూర్తి చేసిన తరువాత భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం, ఆత్మకూరు రోడ్డులోని శ్రీ లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా ఉదయం నుండే భక్తులు దేవాలయాలకు చేరుకుని స్వామి దర్శించుకున్నారు. పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ రవి కుమార్ ల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

నందికొట్కూరు: నియోజకవర్గ వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. 10 బొల్లవరం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు ఉత్తర ద్వారం మీదుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు తులసి మొక్కకు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

-పగిడ్యాల: మండలంలోని ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారికి విష్ణునామ పారాయణం చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.



మిడుతూరు పీరుసాహెబ్‌పేటలో..



మిడుతూరు: లక్ష్మీ చెన్న కేశవస్వామి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడు బంగ్లా, తర్తూరు, తరిగోపుల, 80బన్నూరు, మండ్లెం, పారుమంచాల, తూడిచెర్ల తదితర గ్రామాల్లోని వైష్ణవాలయాలు గోవిందనామస్మరణతో మార్మోగాయి. భక్తులు ఉదయాన్నే వైకుంఠ ద్వారం మీదుగా ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

మిడుతూరు: మండల కేంద్రంతో పాటు పీరుసాహెబ్ పేట, దేవనూరు, కడుమూరు, చౌట్కూరు, తలముడిపి, చెరుకుచెర్ల, మాసపేట, తదితర గ్రామాల్లో లక్ష్మీ చెన్నకేశవస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామివార్లను పట్టువస్త్రాలతో అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన చేశారు.




జూపాడుబంగ్లా: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



మహానందిలో కోదండరాముడికి లక్షపుష్పార్చన



నందికొట్కూరులో స్వామి దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు



మహానందిలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



ఆత్మకూరులో ఉత్తరద్వారంలో వేంకటేశ్వరస్వామి దర్శనం



ఆత్మకూరులో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు భారీగా తరలివచ్చిన భక్తులు



నందికొట్కూరు మండలం 10 బొల్లవరంలో వేంకటేశ్వరస్వామి



భక్తులకు అల్పాహారం వడ్డిస్తున్న హరిహర సేవా సంస్థ నిర్వాహకులు

14న కబడ్డీ పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని తరిగోపుల గ్రామంలో ఈనెల 14న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.2,500 చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి ఈనెల 13వ తేదీ సాయంత్రంలోగా 9391731970, 8639168705 నంబర్లకు కాల్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

13నబండలాగుడు పోటీలు

ఈనెల 13న అంతర్‌రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నారాయణరెడ్డి, నాగార్జున రెడ్డి, దొరబాబు తెలిపారు. గెలుపొందే వృషభాల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున బహుమతులు అందజేస్తావన్నారు. ఎద్దుల యజమానులు 9963926943, 97040 40782, 90000 02242 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న విద్యుత్‌శాఖ మంత్రి



మంత్రి గొట్టిపాటికి స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేలకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో మంత్రి, ఎమ్మెల్యే లకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

గోసంరక్షణతో మానవ మనుగడ సాధ్యం



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: గోసంరక్షణతో మానవ మనుగడ సాధ్యమవుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో శుక్రవారం హిందూధార్మిక కార్యక్రమాల్లో భాగంగా గోపూజ నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవుకు మానవుని జీవితానికి దగ్గరి సంబంధం ఉందన్నారు. అంతరించిపోతున్న గోజాతిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓ గోవును సంరక్షించటం ద్వారా గోజాతిని కాపాడినవారవుతారని పేర్కొన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నిత్యం భగవద్గీత, రామాయణం, మహాభారతం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను చదవడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోకేశ్వరరెడ్డి, మండ్లరాముడు, రామచంద్రుడు, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, పాపయ్యచారి, వెంకటస్వామి, జనార్దన్‌రెడ్డి, బాబు, ఆంజనేయులు, రాము, శేఖర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలలో 18 మంది ఎంపిక

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో మూడు ప్రైవేట్ కంపెనీల్లో 18 మంది అర్హత సాధించారన్నారు.

ప్రభుత్వం విఫలం

మహానంది: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయ్, మహానంది మండల కార్యదర్శి సామేలు అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మహేశ్వరమ్మ, రామేశ్వరయ్య, జమాల్ బాష, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

ఆత్మకూరు/నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మండలం	అధ్యక్షుడి పేరు
శ్రీశైలం	వి.వెంకటరెడ్డి,
ఆత్మకూరు	డి. రాజమోహన్‌రెడ్డి
మున్సిపాల్టీ	ఎస్ఎస్ సయ్యద్ మీర్
వెలుగోడు	ఏ.ప్రభాకర్‌రెడ్డి
బండిఆత్మకూరు	బి.శ్రీనివాసరెడ్డి
మహానంది	కె. మహేశ్వరరెడ్డి
నందికొట్కూరు	జె.అశోక్‌కుమార్‌రెడ్డి
మున్సిపాలిటీ	షేక్ మన్సూర్ అహమ్మద్
పగిడ్యాల	పుల్యాల నాగిరెడ్డి
మిడుతూరు	టి. లోకేశ్వరరెడ్డి
జూపాడుబంగ్లా	టి. కృష్ణారెడ్డి
పాములపాడు	టి. నాగరాజు
కొత్తపల్లి	కె. సుధాకర్‌రెడ్డి

మోడల్ స్కూల్‌కు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు

మహానంది: మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు మరోసారి జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నేషనల్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆడిట్‌లో ఏపీ మోడల్ స్కూల్‌కు గ్రీన్ రేట్ ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 113 పాఠశాలలో జీఎస్పీ ఆడిట్ సబ్మిట్ చేయగా అందులో కేవలం 16 పాఠశాలలు మాత్రమే గ్రీన్ రేట్ సాధించాయన్నారు. నంద్యాల జిల్లా నుంచి మహానంది ఏపీ మోడల్ స్కూల్ ఎంపికైందన్నారు. వచ్చే నెల ఢిల్లీలో జరిగే జాతీయ జీఎస్‌పీ కార్నివాల్‌లో గ్రీన్ సర్టిఫికెట్ అందిస్తారన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

సమ్మె కాలపు ఒప్పందాల జీఓ జారీ చేయాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జీఓ జారీ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని గౌడ్ సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ కానుక ప్రతి కార్మికుడికి రూ.1000 ఇవ్వాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కరణల ఆర్థిక సాయం పెంపు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు, తిమ్మయ్య, గొడుగు రాజు, ప్రసాద్, సువర్ణమ్మ, మున్సిపల్ కార్మికులు జయన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే నిరాహార దీక్ష



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నందికొట్కూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ ఆప్కాస్ కార్మికులకు రూ. 21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. సమ్మె కాలం నాటి హామీలను అమలు చేయాలని కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చాంద్ బాషా, రామయ్య, మారెన్న, సర్వర్‌ఖాన్, రాము, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

డీవీఎంసీలో ఇద్దరికి చోటు

మహానంది: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా మహానంది మండలం నుంచి ఇద్దరికి చోటు లభించింది. తమ్మడపల్లె గ్రామానికి చెందిన మదర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.మురళి, గోపవరం గ్రామానికి చెందిన న్యాయవాది చుట్ల కాశన్నలను ఎంపిక చేశారు. ఈ మేరకు వారికి శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ జమున నియామక పత్రాలను అందించారు. చుట్ల కాశన్నను మహానంది మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు చెవుల వెంకటసుబ్బయ్య అభినందించారు.



సూపరింటెండెంట్ జమున నుంచి పత్రం అందుకుంటున్న కాశన్న